క్లుప్తంగా

కొంగారెడ్డిపల్లిలో సత్యమ్మ జాతర



కర్పూర హారతులిస్తున్న డిప్యూటీ మేయర్

చిత్తూరు రూరల్: ఆడినెలను పురస్కరించుకుని చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని శ్రీ సత్యమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తర్వాత భక్తులు ఊరేగింపుగా వచ్చి అంబలిపోశారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి అమ్మవారికి కర్పూర హారతులిచ్చి దర్శించుకున్నారు.

నేడు 197 రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ అనూష తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామంలో వైద్యసేవలు అందజేయనున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, గర్భిణులు, బాలింతలతోపాటు నడవలేని వారికి ఇంటివద్దనే వెళ్లి వైద్యం చేయనున్నట్లు తెలిపారు.

సైకిల్ సవారీ మంచి వ్యాయామం



సైకిల్ రైడ్‌లో పాల్గొన్న చిత్తూరుకు చెందిన సైకిల్ రైడర్స్


చిత్తూరు కలెక్టరేట్: సైకిల్ సవారీ ఆరోగ్యానికి మంచి వ్యాయామం అని సైకిల్ రైడర్స్ డాక్టర్ జయంత్, అరుణ్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సైకిల్ రైడ్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యానికి శారీరక దృఢత్వానికి సైకిల్ తొక్కడం ఎంతో ప్రయోజనకరమన్నారు. అనంతరం చిత్తూరు నగరం నుంచి తమిళనాడు రాష్ట్రం షోలింగర్ వరకు, అక్కడి నుంచి చిత్తూరుకు 77కి.మీ. సైకిల్ రైడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్, డాక్టర్ సునీల్, సురేంద్రరెడ్డి, సూరీ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు



గుడిపాల: రైతులకు అవసరమైన ఎరువులను రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, డీఏపీ ఎరువులు ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా పలుచోట్ల వరినాట్లు వేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారని వారికోసం ఎరువులు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. యూరియా బ్యాగు ధర రూ.267, డీఏపీ బ్యాగు ధర రూ.1350గా నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు



చిత్తూరు కార్పొరేషన్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వెనుకవైపు వీధిలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలోని వీరభద్రకాలనీ, నాగాలమ్మగుడి వీధిలో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. ప్రమాదకరంగా ఉన్న తీగలను సిబ్బంది తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. దీంతో ఆడికృత్తిక ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అడుగడుగునా నిఘా!

- నిర్వహణ తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- సమస్యలు, ఫిర్యాదులపై కలెక్టర్ ప్రత్యేక చొరవ
- మరోసారి ఫిర్యాదులొస్తే ఊరుకోమంటూ హెచ్చరిక





జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, రోగులతో కిటకిటలాడుతున్న ఓపీ విభాగం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణలో అధికార యంత్రాంగం అడుగడుగునా నిఘా పెట్టింది. ప్రభుత్వం లక్ష్యాల మేరకు ఆస్పత్రి నిర్వహణ, వైద్య సేవల అమలు తీరుపై జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తక్షణం ఆస్పత్రిపై వచ్చే సమస్యలపై స్పందిస్తున్నారు. ఆస్పత్రి అధికారులను పిలిచి ఎప్పటికప్పుడు మందలిస్తున్నారు. ఫిర్యాదులొస్తే ఊరుకోమని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో ఆస్పత్రి అధికారుల్లో గుబులు పట్టుకుంది.

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలను విస్తృతం చేస్తోంది. పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఆశయంతో పనిచేస్తోంది. దీంతో వైద్య రంగంలో మార్పులొచ్చాయి. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ప్రభుత్వం సకల వసతులను కల్పిస్తోంది. వైద్య పరికరాలు, పలు రకాల పరీక్ష పరికరాలను అందించి పేదలకు ఉచిత వైద్య సేవలను మరింత బలపరుస్తోంది. మందులు, మాత్రలు కొనుగోలుకు ఢోకా లేకుండా చూస్తోంది. అవి అందుబాటులో లేని పక్షంలో ఆస్పత్రి నిధుల నుంచి వ్యయం చేసుకునేలా ఆదేశాలిచ్చింది. ప్రతి సర్జరీ, ప్రసవం చేస్తే వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద ఆస్పత్రికి నిధులు జమచేస్తోంది. ఈ నిధులు రూ.4 కోట్లు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఈ నిధులను డాక్టర్ల ప్రోత్సాహానికి కొంత మేర కేటాయించి మిగిలిన నగదును ఆస్పత్రి అవసరాలకు వాడుకునేలా ఆదేశాలు ఉన్నాయి. డాక్టర్లు, సిబ్బంది ఖాళీలను వెనువెంటనే భర్తీ చేస్తోంది. ఈ మేరకు అధికార యంత్రాంగం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటోంది.

జిల్లా ఆస్పత్రికి ప్రతిరోజు ఓపీకి 1000 మంది వరకు వస్తుంటారు. అన్ని విభాగాలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కిటకిటలాడుతుంటాయి. మధ్యాహ్నం నుంచి ఓపీ సేవలు ఉండవు. అత్యవసర విభాగానికి 150 నుంచి 200 కేసుల వరకు వస్తున్నాయి. అయితే సేవలు అందించడంతో వైద్యులు కొంతమంది నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా అపోలో, ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయం లోపిస్తోంది. దీంతో ఆస్పత్రి నుంచి తరచూ సేవలు అందించడంలో సమస్యలు పుట్టుకొస్తున్నాయి.

అధికారులకు ఫిర్యాదు ఇలా

- ప్రసవ కేసులపై నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రసూతి విభాగంలోని సిబ్బంది స్పందించడంలేదు. సీఎంసీ, స్విమ్స్, ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.
- ప్రసవం చూస్తే రూ.500పై వసూలు చేస్తున్నారని, ప్రసవం అయ్యాక జనరల్, ఐసీయూ వార్డులకు తరలించేందుకు రూ. 100, రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి.
- కొన్ని కిట్లు, మందులు, మాత్రలు బయట తీసుకోవాలంటూ చీటీ రాయిస్తున్నారని కలెక్టర్‌కు, జేసీ దృష్టికి వెళ్లింది.
- ప్రైవేటు వాళ్లతో కుమ్మక్కై పలు రకాల పరీక్షలను బయటకు పంపుతున్నారు. రక్త పరీక్షల శ్యాంపిల్స్ సేకరణకు ప్రైవేటు వ్యక్తులను బయటి నుంచి రప్పిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.
- అనవసరంగా పలు రకాల ల్యాబ్ పరీక్షలు రాయిస్తూ, కమీషన్లు తీసుకుంటారన్న ఆరోపణలున్నాయి.
- అత్యవసర విభాగంలో సైతం డాక్టర్లు సకాలంలో స్పందించడంలేదని ఫిర్యాదులు వెళ్లాయి. ప్రమాద కేసులను తరచూ వేలూరు సీఎంసీ, స్విమ్స్, రుయా ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. చిన్నపాటి సమస్యలకు పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే తీసుకెళ్లిపోవాలని భయపెట్టిస్తున్నారు.
- కొంత మంది డాక్టర్లకు బదులు ప్రైవేటు వ్యక్తులు పనిచేస్తున్నారని, విధులకు కొందరు ప్రభుత్వ వైద్యులు రావడం లేదని నేరుగా కొంతమంది జిల్లా యంత్రానికి విన్నవించుకున్నారు.

ఫిర్యాదులపై స్పందిస్తూ...

వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ సగిలి షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు వెంటనే స్పందిస్తున్నారు. వెంటనే విచారణ చేపట్టి, ఆస్పత్రి అధికారులను పిలిచి మాట్లాడుతున్నారు. ఎందుకు సమస్యలొస్తున్నాయని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో కలెక్టర్, జేసీ ఆస్పత్రి అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆస్పత్రి సేవల్లో ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఇక ప్రభుత్వ ఆదేశాల మేరకు వారు ప్రత్యేక నిఘా పెట్టారు. కొంత మంది అధికారుల ద్వారా ఆస్పత్రి నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. వాటి ఆధారంగా ప్రతి నెలా ఆస్పత్రి అధికారులతో సమావేశం నిర్వహించి మందలిస్తున్నారు. ముఖ్యంగా ప్రసవ కేసులపై నిర్లక్ష్యం వద్దని, మాత శిశుమరణాలు జరగకూడదని సూచిస్తున్నారు. డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్ కూడా ఎప్పటికప్పుడు ఆస్పత్రి నిర్వహణపై పర్యవేక్షిస్తున్నారు. దీంతో ఆస్పత్రి అధికారుల్లో గుబులు రేకెత్తిస్తోంది. అప్పటి నుంచి చాలా మంది సిబ్బంది, డాక్టర్లు ఓపీకి హాజరవుతున్నారు.

జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోంది



ఆస్పత్రిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆస్పత్రిలో సేవలను మెరుగు పరచాలని ఆదేశించారు. ఫిర్యాదులు రాకుండా చూడాలని చెప్పారు. తరచూ ఫిర్యాదులు రాకూడదన్నారు. వారి సూచనలు, సలహాల మేరకు తాము కూడా పనిచేస్తున్నాం. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు, రోగులు కూడా వైద్య సేవల్లో ఇబ్బందులొస్తే అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

వసంతాపురంలో బంగారక్కకు ఆడిపూజలు





బంగారక్క అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు, అమ్మవారికి పొంగళ్లను తీసుకువెళ్తున్న మహిళలు

గుడిపాల: గ్రామ దేవత బంగారక్క అమ్మవారికి ఆదివారం ఆడిపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వసంతాపురంలోని మహిళలందరూ ఉదయం ఉపవాసాలతో అమ్మవారి వద్దకు వెళ్లి అభిషేకంతోపాటు ప్రత్యేక అలంకరణ చేశారు. అక్కడే పొంగళ్లను పెట్టి మంగళవాయిద్యాల మధ్య పూజలు చేశారు. కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఉచిత కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, దివంగత ఎంపీ చెంగల్‌రాయ నాయుడి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి శిబిరానికి వచ్చిన 140 మందికి తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి డాక్టర్లు శ్రీధన్య, అర్చన పరీక్షలు నిర్వహించారు. అందులో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిని తిరుపతికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్రనాయుడు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు ఫిజియోథెరపీ కళాశాలలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

వర్క్‌షాప్ విజయవంతం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో ఫిజియోథెరపీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన న్యూరో డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. 230 మంది అధ్యాపకులు, విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. చెన్నై సవిత కళాశాల వైద్యులు కుమరేష్, మాధవ్, రాజస్థాన్‌కు చెందిన అరుణాచలం ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. న్యూరోసర్జరీకి సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన ఉంటుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సప్ – 98499 07885కు సమస్యలు తెలియజేయాలని కమిషనర్ కోరారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళిమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దష్టికి తీసుకోరావచ్చని ఆయన పేర్కొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం 10:30 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు చెప్పారు.

మునీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



మునీశ్వరస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

గుడిపాల: మండలంలోని వసంతాపురం సమీపంలో ఉన్న మునీశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పొంగళ్లు పెట్టి, పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

జానపద కళలను కాపాడుకుందాం

చిత్తూరు రూరల్: ఆనాటి జానపద కళారూపాల వైభవం, గీతాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందని మన సంస్కృతి కళా సంస్థ నిర్వాహకులు సహదేవనాయుడు అన్నారు. చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం జానపద గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి హాజరైన కళాకారులు కళలను ప్రదర్శించి అలరించారు. అనంతరం బుర్రకథ, ఒగ్గు కథలు, గొబ్బి పాటలు, పల్లె పాటలు, హరికథలు, వీధి నాటకాలు, తొలుబొమ్మలాటలు, చెక్క భజనలు, కోలాటాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హరినాయుడు, అరుణకుమారి, మునస్వామి, మొగిలిశెట్టి, రాధా, శంకరప్ప, రమేష్‌బాబు, భాగ్యలక్ష్మి, శేషాద్రి పాల్గొన్నారు.

ఆపస్ చిత్తూరు కన్వీనర్‌గా రాధాకృష్ణన్



చిత్తూరు కలెక్టరేట్: ఆపస్ చిత్తూరు నియోజకవర్గం కన్వీనర్‌గా రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథ గుప్త, దొరస్వామి తెలిపారు. నగరంలోని ప్రశాంత్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో ఆదివారం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో టీచర్ల సమస్యల పరిష్కారంపై చర్చించారు. అనంతరం బంగారుపాళ్యం మండలం ఎగువరాగిమానుపెంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న రాధాకృష్ణన్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు హనుమంతరెడ్డి, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుల్లెట్ సురేష్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్: రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ జన్మదిన వేడుకలు నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీ కృష్ణ విలాస ఆలయంలో ఆయన పేరుపై అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభిషేకం చేయించారు. అనంతరం పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి బీరువా అందజేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి, సంతపేట వృద్ధాశ్రమంలోనూ అన్నదానం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం చేపట్టగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్ని దాతలకు పండ్లు, జ్యూష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ భాస్కర్, స్థానిక కార్పొరేటర్లు నవీన్, కుట్టి రాయల్, శ్రీకాంత్, లక్ష్మణన్, జ్ఞాన జగదీష్, ఎకే రవి, చిత్తూరు మొదలియార్ సంఘం అధ్యక్షులు రాజశేఖర్ సభ్యులు సుందరం, గురు గణేష్, ఉదయ,స్టోర్ శివ, టౌన్ బ్యాంక్ చైర్మన్ రామ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పిరమిడ్ మాస్టర్‌తో ధ్యానులు

ధ్యానంతో ఒత్తిడి దూరం

బంగారుపాళెం: ధ్యాన సాధనతో మానసిక ఒత్తిడి అవుతుందని విశాఖ ప్రకృతి వ్యాలీ నిర్వాహకుడు, సీనియర్ పిరమిడ్ మాస్టర్ దాట్లరాయ జగపతిరాజు అన్నారు. మండలంలోని కుప్పాలపల్లెలోని బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యాన ఆశ్రమాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఆశ్రమంలో ధ్యాన సాధన నిర్వహించారు. ధ్యానం ప్రాముఖ్యత, సాధనపై అవగాహన కల్పించారు. నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ నిద్ర లేచింది మొదలుకుని రాత్రి వరకు అనేక సంఘర్షణలకు గురవుతుంటారన్నారు. మానసిక ఒత్తిడి నుంచి దూరమవడానికి ధ్యానం మంచి మార్గమని సూచించారు. అనంతరం జగపతిరాజును ఆశ్రమ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో రోహిణి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



ప్రమాదకర విన్యాసాలు

చిత్తూరు నగరం వేలూరు రోడ్డులో ఇద్దరు పిల్లలు సైకిల్‌పై ప్రమాదకర విన్యాసాలు చేవారు. వీరిద్దరూ పోటా పోటీగా ఫీట్లు చేస్తూ, రద్దీగా కనిపించే రోడ్డుపై హల్‌చల్ చేశారు. కేవలం వెనుక చక్రం సాయంతో మాత్రమే సైకిల్ నడుపుతూ సవారీ చేశారు. ఈ దృశ్యాలు కలెక్టరేట్ –బెంగుళూరు మార్గం, పలమనేరు రోడ్డు, గిరింపేట రోడ్డు, కలెక్టర్ బంగ్లా రోడ్లపై కనిపిస్తున్నాయి. –చిత్తూరు రూరల్

బీఎన్‌ఆర్‌పేటలో ఇద్దరికి నోటీసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేటకు చెందిన ఇద్దరు వ్యక్తులకు ఆదివారం బీఎస్‌ఆర్‌పేట పోలీసుల సహకారంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ రానజిత్‌నాథ్ విచారణకు ఆదేశిస్తూ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఈనెల 21వతేదీ మధ్యాహ్నం 12 గంటలకు వారు పశ్చిమ బెంగాల్‌లోని సైబర్ పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ



దుర్యోధనవధ సన్నివేశాన్ని తిలకించడానికి విచ్చేసిన భక్తజనసందోహం



దుర్యోధన వధ ఘట్టంలోని ఓ సన్నివేశం

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో సాగుతున్న మహా భారత యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతార్ వరలక్ష్మి హరికథ గానాలాపం చేశారు. అనంతరం మట్టితో సుందరంగా తీర్చిదిద్దిన దుర్యోధనుడి విగ్రహం వద్దకు ద్రౌపదీ దేవి, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల, పోతురాజు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి దుర్యోధనుడి విగ్రహం వద్ద ఉంచారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భీముడి వేషధారి మడుగులో దాగి ఉన్న దుర్యోధన వేషధారిని ఈడ్చుకొచ్చి వధించే సన్నివేశం రక్తి కట్టించారు. దుర్యోధన వధ సన్నివేశాన్ని తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి అశేష జనం తరలివచ్చారు. మహాభారత యజ్ఞం కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సురేష్, ధర్మకర్త రవి, ఎం.వేణు, హేమాద్రి, మాజీ సర్పంచ్ రాజేష్, ఎం.సంతోష్, గ్రామస్తుల సహకారంతో దిగ్విజయంగా నిర్వహించారు.